క్లుప్తంగా

గడువులోగా పనులు పూర్తి చేయాలి

మానవపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణ పనులను డిప్యూటీ ఈఈ నరేందర్, ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు డిజైన్, సాకర్యాలపై సూచనలు, సలహాలు అందజేశారు. పనులు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపాలంటూ రాస్తారోకో



ఆత్మకూర్: ఆర్టీసీ బస్సును నిత్యం నడపాలంటూ రేచింతల గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని చివరి గ్రామమైన రేచింతల నుంచి రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులకు ఒకసారి బస్సు వస్తుండడంతో విద్యార్థులు, ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, బాలకృష్ణ, కృష్ణయ్య, శాంతన్న, నర్సింహ, బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో గడ్డి విత్తనాలు

శాంతినగర్: గడ్డి విత్తనాలు సబ్సిడీపై వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ సీడ్ బహుళ కట్ హైబ్రిడ్ విత్తనం, మొదటి కోత 65 రోజులకు, తరువాతి కోతలు 45 రోజుల తరువాత చేసుకోవచ్చని వివరించారు. హెక్టార్‌కు 800 నుంచి 950 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సబ్సిడీపై పంపిణీ

ఉండవెల్లి: మండల కేంద్రం, మారమునగాల, బొంకూరు, పశువైద్య కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పశువైద్యాధికారి శిరీషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడ్డి విత్తనాల ధర కేజీ రూ.104.41 ఉంటుందని, కావాల్సిన వారు కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత



మల్దకల్: గతేడాది విద్యుదాఘాతంతో మృతిచెందిన మండలంలోని చర్లగార్లపాడు గ్రామానికి చెందిన నల్లన్న భార్య జయమ్మకు శుక్రవారం మల్దకల్ యూనియన్ బ్యాంకు మేనేజర్ గంగాధరం రూ. 5లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నాగేంద్రబాబు, శివకుమార్, ఆశన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం పాదయాత్ర

అయిజ: దేశంలోని అన్ని శక్తిపీఠాలు దర్శనం చేసుకునేందుకు పాదయాత్ర చేస్తున్న నర్మదానంద స్వామి శుక్రవారం అయిజ పట్టణం మీదుగా పాదయాత్ర సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక కల్యాణార్థం 17500 కి.మీ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని అమరకంటక్ నర్మదా కుండ శక్తిపీఠం నుంచి గుజరాత్‌లోని అంబాజీ శక్తిపీఠం మౌంట్ అంబాజీ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

అమరచింత: దేశంలో ప్రజల మధ్య విబేధాలు సృష్టించి రాజ్యపాలన చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో వక్ఫ్ సవరణ బిల్లును అమలు పరిచి ముస్లింల మనోభావాలను దెబ్బతీయడం తగదన్నారు. వెంటనే వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని ఇచ్చినా.. అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మైబు, మల్లేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంకిన నీరు.. ఎండుతున్న పైర్లు

- అడుగంటిన భూగర్భ జలాలు
- బోర్లలో చుక్కనీరు రాని దుస్థితి
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు



కేటీదొడ్డి శివారులో ఎండిన వరి పంట

కేటీదొడ్డి: భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సరిపడా నీరందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే దశలో బోర్ల కింద సాగు చేసే పొలాల్లో నీరురాక పంటలు ఎండుముఖం పడుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేటీదొడ్డి, నందిన్నె, ఉమిత్యాల, కొండాపురం, గువ్వలదిన్నె, ఈర్లబండ, ఇర్కిచేడు, కుచినెర్ల, చింతలకుంటతో పాటు ఆయా గ్రామాల్లో ఇప్పటికే దాదాపు 80 శాతం బోర్లు నీళ్ల లేక ఎండిపోయాయి. అలాగే బావులు, చెరువులు, కుంటల్లో చుక్కనీరు కూడా లేని పరిస్థితి ఏర్పడింది.

14,019 ఎకరాల్లో సాగు

మండలంలోని 14,019 ఎకరాల్లో సాగుభూమి ఉండగా అందులో 8700 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేస్తున్నారు. దాదాపు 400 అడుగుల వరకు బోరు వేయించినా నీళ్ల పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు వరుస బెట్టి బోర్లు వేయిస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో పంట దిగుబడి రాక అప్పులపాలవుతున్నట్లు వాపోతున్నారు. మరికొన్ని చోట్ల పంటలు ఎండిపోతుండడంతో పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు.

అవగాహన రాహిత్యం

రైతులు తమ పొల్లాలో ఎన్ని అడుగుల లోతు వరకు బోరు వేయాలో అవగాహన లేక బోరు నిరుపయోగంగా మారుతున్నాయి. మరికొన్ని చోట్ల నీళ్లు పడినా సాగుకందక పంట నష్టపోతున్నారు. బోరు వేయాలనుకున్నా రైతులు ముందుగా జియాలజిస్టులను సంప్రదించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాన్ని చూపించి భూమిలో జల ఉందని ధ్రువీకరిస్తేనే బోరు వేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. బోరుకు బోరుకు మధ్య దూరం ఉండాలని సూచిస్తున్నా రైతులు ఇవేమి పట్టించుకోకుండా బోర్లు వేసి అప్పులపాలవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పూర్తిగా నీళ్లు తగ్గాయి..



బోర్ల కింద పంటకు నీరందించవచ్చని ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాం. కానీ పంట చివరి దశలో ఉండగా బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. ఇప్పటికే నాలుగు ఎకరాల్లో పంట ఎండిపోయింది. పంట పూర్తయ్యే వరకు ఎకరం కూడా మిగులుతుందో లేదో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయాయి. కొత్తబోరు వేసినా నీళ్ల వస్తాయనే నమ్మకం లేదు.

-కిష్టప్ప, రైతు, కేటీదొడ్డి

బోర్లు వట్టిపోయాయి..



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నాను. ఇంకో 20 రోజులు గడిస్తే పంట పూర్తయ్యేది. కానీ పంట పొట్టదశలో ఉండగా బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. రెండు ఎకరాల్లో వరి ఎండుముఖం పట్టింది. భూగర్భ జలాలు లేక బోర్లలో కూడా నీరు రావడం లేదు. గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితేనే ఇక్కడి పంటలకు సాగునీరు అందుతుంది.

-తాయప్ప, రైతు, గువ్వలదిన్నె

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అమర్నాథ్ సారంగులు

గద్వాలటౌన్: బీజేపీ సంస్థాగత నిర్మాణం, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్నాథ్ సారంగులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డీకే బంగ్లాలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 6 నుంచి 12వ వరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. 6, 7వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేపట్టాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. 8, 9వ తేదీల్లో మండల స్థాయిలో సదస్సు నిర్వహించి, ముగ్గురు క్రియాశీలక సభ్యులు వివిధ అంశాలపై మాట్లాడాలని సూచించారు. 10, 11, 12వ తేదీల్లో గావ్ చలో– బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించాన్నారు. దేవాలయం, ఆసుపత్రి, పాఠశాల వద్ద స్వచ్ఛ భారత్ సేవ కార్యక్రమాలు చేపట్టాన్నారు. బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్ ఏక్బోటే, అక్కల రమాదేవి, జయశ్రీ, శివారెడ్డి, అనిల్, చిత్తారికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల సందర్శన



గద్వాల న్యూటౌన్: ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గద్వాల మండలం గుంటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్‌సీసీ పెరేడు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాలను పరిశీలించారు. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించడం వల్ల కొత్త విషయాలను తెలుసుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కురుపయ్య, నయూమ్, సత్యనారాయణగౌడ్, చక్రధర్ పాల్గొన్నారు.

రేపు ఎద్దుల బండ్ల గిరక పోటీలు

గట్టు: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఎద్దుల బండ్ల గిరక పోటీలు నిర్వహిస్తున్నట్లు గండి ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు బండ్ల గిరక పోటీల్లో మొదటి బహుమతి రూ. 8016, ద్వితీయ బహుమతి రూ. 6016, తృతీయ బహుమతి రూ. 4016, నాల్గవ బహుమతి రూ.2016 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా సందెరాళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు, మొదటి బహుమతి రూ.8016, ద్వితీయ బహుమతి రూ.6016, తృతీయ బహుమతి రూ.4016, నాల్గవ బహుమతి రూ.2016లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు కమిటీని సభ్యులను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం, సాతర్ల సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ నుంచి సాతర్ల, చాగాపురం గ్రామ పరిధిలోని 33 కేవీ కొత్తఫీడర్ పనుల నేపథ్యంలో చాగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 వరకు, అదే విధంగా సాతర్ల సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్డులివ్వకుండా సన్నబియ్యమెలా ఇస్తారు



మాట్లాడుతున్న పల్లయ్య

అయిజ: రేషన్ కార్డులు ఇవ్వకుండా సన్నబియ్యం ఎలా అర్హులందరికీ పంపిణీ చేస్తారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయకుండా సన్నబియ్యం పథకం ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయటం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాడుతామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వీరేష్, చక్రవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహస్వామి ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలు వైభవంగా చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

హెల్ప్‌డెస్క్ సద్వినియోగం చేసుకోండి



ఆత్మకూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగ యువతి, యువకులకు అందిస్తున్న రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో 48 మంది అభ్యర్థులు దరకాస్తులు చేసుకున్నారని వివరించారు. మండలంలోని అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ వరకు దరకాస్తులు చేసుకొని, పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, సిబ్బంది, దరకాస్తుదారులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, ఎండల తీవ్రత పెరిగినందున నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఎంపీడీఓ శ్రీపాద్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందించారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



మల్దకల్: మండలంలోని ఎల్కూరు గ్రామంలో 6న సీతారామ, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వేదపండితులు రమేషాచారి, ప్రసన్నచారి, శశాంక, మధుసూధనాచారి, రవిచారి విగ్రహాలకు పత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేదపండితులు హోమం చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఖిల్లా గట్టు దర్గాలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఖిల్లా గట్టుపై ఉన్న హజరత్ ఆఘా దావుద్(ఆఖర్‌సాబ్)గంధోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖిల్లా గట్టుపై ఉన్న చారిత్రక కట్టడాలను కాపాడటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ కుటుంబ సభ్యులు, మండల నాయకుడు రాముయాదవ్, మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అధ్యాపకులు

గద్వాల న్యూటౌన్: మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మీనాక్షి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యువతను, ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్నవారిని డ్రగ్స్ ముఠా టార్గెట్ చేసుకొని, మాదక ద్రవ్యాలను అలవాటు చేస్తుందన్నారు. తాత్కాలిక సంతోషాల కోసం బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువు, భవిష్యత్‌పై దృష్టి సారించి యాంటి డ్రగ్ సోల్జర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. కళాశాల యాంటీ డ్రగ్ కోఆర్డినేటర్ జగన్‌మోహన్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినట్లు సమాచారం తెలిసినా 1908 సమాచారం అందించాలని కోరారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో యాంటీ డ్రగ్‌పై నిర్వహించే స్కిట్‌ప్లే, పోస్టర్ మేకింగ్, షార్ట్‌ఫిలిం, క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కుర్వ విజయ్‌కుమార్

గద్వాల: జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల నియోజకవర్గంలో 814 ఇళ్లు, అలంపూర్ నియోజకవర్గంలో 720 ఇళ్లు మాత్రమే కేటాయించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎల్–1, ఎల్–2, ఎల్– 3 కేటగిరీల కింద ఇళ్లు లేని దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 70,765 మంది ఉన్నారన్నారు. కానీ కేవలం జిల్లాకు 1534 ఇళ్లు మాత్రమే మంజూరు చేయడం దారుణమన్నారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రాము, రామాంజనేయులు, నర్సింహ, నరేష్, దామోదర్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలను శుక్రవారం మండల విద్యాధికారి రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, రికార్డులు పరిశీలించారు. అపార్ అప్‌డేటేషన్ కార్యక్రమాలు పరిశీలించారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



అమరవాయిలో సన్నబియ్యం పథకం ప్రారంభిస్తున్న నీలి శ్రీనివాసులు, మహ్మద్ సిరాజ్

అయిజ/మానవపాడు/ఇటిక్యాల/గట్టు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని సంకాపురం గ్రామంలో తహసల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదే విధంగా అయిజ పట్టణంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప సన్నబియ్యం పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

★ ప్రతి ఒక్కరూ కడుపు నింపాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా పంపిణీ కార్యక్రమంలో గొప్ప పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్నారని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా డీసీసీ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ అన్నారు. మానవపాడు మండలంలోని అమరవాయి గ్రామంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఆర్‌ఐ గురురాజ్, రైతు సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీర్, అబ్దుల్ రహమాన్, కురవ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మోహన్, తేదేశ్వర్‌గౌడ్, తెలుగు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

★ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు షాబాద్, బుద్దారెడ్డిపల్లి, ఎం.ఆర్ చెర్వులలో అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఉసేన్, ఆర్ఐ మదన్‌మోహన్, జేఏలు ఈశ్వర్, ఆలీబాష, రఘు, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

★ గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని డిప్యూటీ తహసీల్దార్ విజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ వరలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్‌పాష, కృష్ణ, గౌస్, వీరేష్, హన్మంతు, సుందర్‌రాజు, కృష్ణయ్యగౌడ్, అంపన్న, నరిసంహులు, రామన్‌గౌడ్, జయ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

★ ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పుటాన్‌దొడ్డి, సాసనూలు, ఆర్.గార్లపాడు గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ అధికారులతో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శంషీర్, శ్రీనివాసులు, నాయకులు సోమనాద్రి, నర్సింహులు, నాగరాజు, వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సంకాపురలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



పుటాన్‌దొడ్డిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత, రమాసత్యనారాయణ స్వామి, శిఖర కలశ ప్రతిష్ఠామహోత్సవాన్ని ఆత్మకూర్‌లోని కన్యకా పరమేశ్వరిమాత ఆలయంలో శుక్రవారం ప్రముఖ వేదపండితుడు శివసుబ్రమణ్యం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిష్ఠ పూజల్లో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజలు, దేవతమూర్తులకు, యంత్రములకు విశేష అభిషేకం, మూర్తిహోమం, అభ్యవర్తిని హోమం, ప్రతిష్ఠాంగహోమం, సర్వప్రాయచిత్తం, జయాధిహోమం, మృగశిర నక్షత్రయుక్త వృషభలగ్న, శుభపుష్కరాంశమునందు గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస, ధాతున్యాస, పూర్వకయంత్ర, అనంతరం విగ్రహప్రతిష్ఠాపన, బింబకళన్యాసం, కుంభాన్నబలి, కక్షజ్వాల, గోదర్శనం, సునాసిని, దీపదర్శనం, ప్రతిష్ఠామూర్తి దర్శనం, విశేష ప్రధమపూజ, బలిప్రదానం, మహాపూర్ణహూతి, దేవత ఉద్యాసన, అవభృతస్నానం, తదితర పూజలు చేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల — కె.వీరాంజనేయుడు - 9642913894
అలంపూర్/అయిజ — ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్ ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బర్ లాల్ : 9553955603